మాలధారణం.. నియమాల తోరణం

- అయ్యప్ప దీక్ష.. ఆరోగ్య రక్ష
- పెరుగుతున్న ఆధ్యాత్మిక చింతన
- మండలం రోజుల పాటు ఆలయంలో భిక్ష

ప్రొద్దుటూరు కల్చరల్ : 'శరణుశరణు శబరిగిరీశా' అంటూ అయ్యప్పస్వామి సన్నిధానానికి చేరే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. చెడు వ్యసనాలకు దూరంగా, నిత్యం దైవనామ స్మరణ చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో గడపడం, మాలధారణ ప్రత్యేకత. అయ్యప్ప మాలధారణ కఠోర నియమ నిష్ఠలతో మండలం రోజుల పాటు దీక్షను పూర్తి చేస్తారు. ఇహపర సుఖాలు, ఐహిక భోగాలకు దూరంగా, లోకకల్యాణమే ధ్యేయంగా సాగే అయప్పమాలపై ప్రజలకు ఆసక్తి పెరుగుతోంది. చెడు మార్గం నుంచి సన్మార్గంలో పయనించడానికి, వ్యసనాలను వీడి ఆధ్యాత్మిక భావనతో నడుచుకోవడానికి మాల ధారణ ఒక చక్కని సాధనం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలయాలు దీక్షధారులతో కనిపిస్తున్నాయి. ప్రొద్దుటూరు శివారు ప్రాంతం పెన్నానదీ తీరంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక మాసం ముందు నుంచే భక్తులు మాలధారణ చేపట్టారు. వారు మండల దీక్ష పూర్తి చేసుకుని ఆలయంలో ఇరుముడి కట్టుకుని అయ్యప్పస్వామి సన్నిధానానికి తరలి వెళుతున్నారు. అయ్యప్పస్వామి మండల దీక్షలు నవంబర్ 16 నుంచి డిసెంబర్ 26 వరకు జరగనున్నాయి. పట్టణం నుంచి రోజూ దాదాపు 200 నుంచి 350 మంది పైగా దీక్షదారులు స్వామి దర్శనానికి బస్సులు, రైళ్లు, ఇతర వాహనాల్లో తరలి వెళుతున్నారు. దాదాపు 7వేల మంది పైగా భక్తులు ఆలయంలో మాలధారణ చేశారు. స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మండల పూజా కార్యక్రమంలో భాగంగా రోజూ స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు, జపహోమాలు నిర్వహిస్తున్నారు. అలాగే స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో దీక్షదారులకు మధ్యాహ్నం, రాత్రి 800 నుంచి 1000 మందికి భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో మండల పూజా సందర్భంగా ఈ నెల 1వ తేదీన అయ్యప్పస్వామి లక్షార్చన నిర్వహించి 30 వేల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అలాగే 12వ తేదీన అయ్యప్పస్వామి, పార్వతీదేవి, అమృతేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.


ప్రొద్దుటూరులోని అయ్యప్పస్వామి ఆలయం

మాల స్వీకరణ
స్వామి యందు నిశ్చలమైన భక్తిభావాలు కలిగి, శబరిమలకు మూడు నాలుగు సార్లు వెళ్లొచ్చి, బ్రహ్మచర్య వ్రతం పాటించే వారిని గురుస్వామిగా ఎన్నుకుని, వారిచేత మాల ధరించాలి. దీక్ష తీసుకోవాలనుకునే భక్తుడు గురుస్వామి వద్ద నుంచి ఉపదేశంతో మాల ధరించాలి. మాలధారణ అనంతరం తన మనస్సునూ, శరీరాన్ని భగవంతునికి అంకితం చేయాలి. అందరినీ భగవంతుని రూపాలుగా భావించాలి. అయ్యప్ప శరణు ఘోషను విడువకుండా నిత్యం భజన కార్యక్రమాల్లో పాల్గొనాలి. 10 ఏళ్ల లోపు ఉన్న ఆడ పిల్లలు, 50 ఏళ్లుపైడిన మహిళలు, 5 ఏళ్ల వయసు నుంచి బాలురు మాల ధారణ చేస్తున్నారు.

దినచర్య
స్వామి చింతనలో, స్వామి భక్తులతో సమయం గడుపుతూ సాత్విక జీవనం అవలంబించడం ఈ దీక్ష ముఖ్య లక్షణాలు. తెల్లవారు జామున లేచి చన్నీటి స్నానం చేయడంతో వీరి దినచర్య ప్రారంభమవుతుంది. నల్లని వస్త్రాలు, తులసిమాల, నుదుటన విభూదిపై గంధం బొట్టు ధరించాలి. కటిక నేల మీద పడుకోవాలి. అందరినీ 'స్వామి' అని సంబోధిస్తూ, దుర్భాషలకు దూరంగా ఉండాలి. ఇలా మండలం పాటు నియమాలతో దీక్షధారులు గడపాలి. భక్తులు కార్తీక మాసమంతా ఐహికమైన సౌఖ్యాలను పరిత్యజించి, మద్యం, మాంస, ధూమపాన వ్యవసానలకు దూరంగా ఉండాలి.

ఏకభుక్తం
ఏక భుక్తం అంటే వంటిపూట భోజనం. దీక్షధారులు మధ్యాహ్నం పూట మాత్రమే భోజనం చేసి ఉదయం, రాత్రి వేళల్లో టిఫిన్, పండ్లు ఫలాహారాలను తీసుకోవాలి.

కటిక నేలపైనే నిద్ర
కటిక నేలపై చాప పరుచుకుని దిండు లేకుండా నిద్రించాలి. దీనివల్ల మెడ, నడుము నొప్పులు దరిచేరవు. భూమికి అయస్కాంత శక్తి ఉండటం వల్ల దాని ప్రభావంతో నొప్పులు రావు.

మాంసాహారానికి దూరం
మాంసంలో అధిక క్యాలరీలు ఉంటాయి. చలికాలంలో ఇది అనారోగ్యానికి కారణమవుతుంది. శాఖహారం సులువుగా జీర్ణమై రోగనిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో మనస్సును సాత్విక ధోరణివైపు మళ్లిస్తుంది.

కర్పూర హారతి
దీక్షధారులు స్వామివారికి కర్పూర హారతి ఇవ్వడం ఆనవాయితీ. కర్పూరానికి సైనస్ వంటి అలర్జీలను హరించే శక్తి ఉంది. పూజ సమయంలో కర్పూర హారతి వల్ల ఇలాంటి వ్యాధులు దరిచేరవు.

సహపంక్తి భోజనం
కుల, మత, హోదా, అంతస్తు, పేద, ధనిక తారతమ్యాలు లేకుండా దీక్షధారులందరూ సమానమే. అందరూ సహపంక్తి భోజనం చేయాలి. ఇది సమానత్వ భావన పెంపొందడానికి దోహదపడుతుంది.

మండల దీక్ష
మండలం అనగా 41 రోజులు. దీక్షధారులు 41 రోజుల పాటు నియమనిష్ఠలతో దీక్షను పూర్తి చేస్తారు. కొందరు అర్ధమండలం కూడా దీక్ష స్వీకరిస్తుంటారు.

పాదరక్షలు వీడటం
పాదరక్షలు లేకుండా మండలం పాటు నడవడంతో పాదాలకు రాళ్లు గుచ్చుకుని ఆక్యుప్రెజర్ ఏర్పడి రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. దీనివల్ల అనారోగ్యం దరిచేరదు.

దైవనామస్మరణ
అయ్యప్ప మాలలో భక్తులు దైవనామస్మరణ చేయడం ద్వారా మంచి నడవడిక, చిన్నా పెద్దా అందరిని 'స్వామి' అని పిలిచి నమస్కరించి మాట్లాడటంతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది.

ఇరుముడి
మండలం రోజులు దీక్షను పూర్తి చేసిన భక్తులు అయ్యప్పస్వామి సన్నిధానానికి చేరుతారు. ఇరుముడిలో రెండు సంచులు ఉంటాయి. ఒకదానిలో 18 రకాల వస్తువులు. ద్రాక్ష, అటుకులు, కలకండా, జీడిపప్పు, పసుపు, కుంకుమ, గంధం, అగరబత్తిలు, కర్పూరం, మిరియాలు, సొంఠి, విభూతి, సాంబ్రాని, తేనె, ఎండు ఖర్జూరం, పన్నీరు, పేలాలు, ఎర్రజా కిట్ వస్తువులు ఉంటాయి. మరోదానిలో రెండు టెంకాయలు ఉంటాయి.

పదునెట్టాంబడి పరమార్థం
పదునెట్టాంబడి అంటనే 18 మెట్లు అని అర్థం. కామ, క్రోధ, మద, మాత్సర్య వంటి 18 రకాల గుణాలను అధిగమించడమే ఈ దీక్ష పరమార్థం. 18 మెట్లల్లో రకాల శక్తులు ఉండటం వల్ల 18 సార్లు యాత్ర చేసి వస్తే జన్మ సార్థకమవుతుందని మాల ధరించిన భక్తుల విశ్వాసం.

30 వేల మందికిపైనే
జిల్లాలో దాదాపు 30 వేల మందికిపైగా భక్తులు అయ్యప్పస్వామి దీక్షను స్వీకరిస్తారు. కొంత మంది కార్తీక మాసం ముందే మాలధారణ చేసి మండలం రోజులు పూర్తి చేశారు.

సన్మార్గంలో నడిచేందుకు..

నియమ నిష్ఠలతో దీక్షను ఆచరించిన వారికి అయ్యప్పస్వామి కోరుకున్న కోరికలను నెరవేర్చుతారు. చెడుగుణాలను వదిలేసి సన్మార్గంలో నడిచేందుకు దీక్ష ఎంతగానో ఉపకరిస్తుంది. ఆధ్యాత్మిక చింతనతో జీవనం సాగించేందుకు భక్తులు దీక్షను స్వీకరిస్తున్నారు.
- నాగేంద్రశర్మ, అయ్యస్వామి ఆలయ ప్రధానార్చకుడు, ప్రొద్దుటూరు

రోజూ ప్రత్యేక పూజలు

మండల పూజాకార్యక్రమాల్లో భాగంగా అయ్యప్పస్వామి వారికి రోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. 31 ఏళ్లుగా స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో దాతలు, భక్తుల సహకారంతో లక్షార్చనను నిర్వహించి వేలాది మందికి అన్నప్రసాదం అందిస్తున్నాం.
- కొవ్వూరు రమేష్‌రెడ్డి, స్వామి అయ్యప్ప సేవాసంఘం అధ్యక్షుడు

అధికార పార్టీకి దాసోహమైన అధికారులు


ఎన్నికలను బాయ్‌కాట్ చేసి వెనుతిరిగి వెళ్తున్న ఓ వర్గం రైతులు

అట్లూరు : మండలంలోని కామసముద్రం చెరువు ఆయకట్టు కింద 109 ఓట్లు ఉన్నాయి. ఈ ఓట్లకు ఎన్నికలు శనివారం ఉదయం ఎనిమిది గంటలకు మొదలయ్యాయి. అయితే ఎన్నికలకు ముందు సంబంధిత ఇరిగేషన్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి పోటీ అభ్యర్థులు ఆయకట్టు పన్ను చెల్లించి భూహక్కు పత్రంతో పాటు ఆధార్‌కార్డు చాలన్నారు. ఆ నిబంధనల ప్రకారం పోటీ అభ్యర్థులు పోలింగు కేంద్రానికి చేరుకున్నారు. అయితే కూటమి పార్టీ తరపున పోటీకి సరిపడా అభ్యర్థులు కూడా కరువయ్యారు. ఉన్న ఓట్లు అన్నీ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులవని తెలిసి కూటమి నాయకులు కూటమి అభ్యర్థికి రెవెన్యూ అధికారులు నో డ్యూ సర్టిఫికెట్ అందజేశారు. అయితే ప్రత్యర్థి అభ్యర్థికి నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా వెళ్లిపోయారు. దీంతో ఎన్నికల అధికారులు పోటీ అభ్యర్థికి నో డ్యూ సర్టిఫికెట్ లేకపోవడంతో పోటీకి వీలు లేదన్నారు. గెలవలేమనే నో డ్యూ సర్టిఫికేట్ ఇవ్వలేదని ఇదంతా ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా చేశారని వారు అన్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు

బద్వేలు అర్బన్ : ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 4, 5వ తేదీల్లో కడప నగరంలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభల జయప్రదం కొరకు పట్టణంలో మాస్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్య, ప్రకృతి వైపరీత్యాలు, హత్యలు, అత్యాచారాలతో ప్రజలు, మహిళలు ఇబ్బందులకు గురవుతుంటే పట్టించుకోవాల్సిన పాలకులు చోద్యం చూస్తున్నారని అన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన హామీ మేరకు జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. పేద, మధ్యతరగతి సామాన్య ప్రజల కోసం అనునిత్యం ఉద్యమించే సీపీఎం పార్టీ మహాసభలను వేదికగా చేసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు పట్టిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

చాపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సమయం పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో విధులకు హాజరుకాని సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు
మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించలేదని నలుగురు వైద్య సిబ్బందికి శనివారం జిల్లా వైద్యాధికారి నాగరాజు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ శనివారం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టిలో సంతకం చేయని ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ శ్రీవాణి, సీహెచ్‌ఓ మహదేవయ్య, పీహెచ్ఎన్ సుకన్యలకు నోటీసులు జారీ చేసి రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

కనుల పండువగా ఆరాధనోత్సవాలు

ఖాజీపేట : మండలంలోని పత్తూరు గ్రామంలో వెలసిన కాశిరెడ్డి నాయన ఆలయంలో ఆరాధనోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు మహా గణపతి, అన్నపూర్ణాదేవి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశినాయన విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రజలకు ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీలు
కాశినాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా పత్తూరు గ్రామంలో ఆలయ నిర్వాహకులు బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలో బాపట్ల జిల్లా సంతమాగులూరు వజ్రాతేజశ్రీరెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.50 వేల గెలుచుకున్నాయి. రెండోస్థానంలో కడప జిల్లా ఓబులంపల్లెకు చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి ఎద్దులు నిలిచి రూ.40 వేల బహుమతిని దక్కించుకున్నాయి. కడప జిల్లా రూకవారిపల్లె విద్య ఓబుల్‌రెడ్డి ఎద్దులు మూడవస్థానంలో, అక్కంపల్లె శశాంక్‌రెడ్డి ఎద్దులు, కడప జిల్లా ఖాదర్‌ఖాన్ కొటాలకు చెందిన డి.భావన ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచాయి. అలాగే కడప జిల్లా ఖాదర్‌ఖాన్ కొటాలకు చెందిన డి. భావన ఎద్దులు ఐదోస్థానంలో, వినుకొండకు చెందిన చిన్నబాయి యాదవ్ ఎద్దులు ఆరవ స్థానంలో బహుమతులు అందుకున్నాయి.


బండలాగుతున్న ఎద్దులు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి.వీరశేఖర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఇమ్మానియేల్‌లు తెలిపారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇంటి స్థలాలు, భూములు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక దానిని విస్మరించడం దారుణమన్నారు. నియోజకవర్గంలో వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతం అయినప్పటికీ ఎక్కడా కూడా స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవని, కేవలం రెవెన్యూ సదస్సులు పెట్టి మమ అనిపించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారే తప్ప పేదలకు న్యాయం జరగడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు బ్రహ్మయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్

ముగిసిన నీటి సంఘం ఎన్నికలు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మైలవరం కాలువకు సంబంధించి మూడు సంఘాలకు పెద్దశెట్టిపల్లె, బొల్లవరం, ప్రొద్దుటూరులోని ఎద్దుల వెంకటసుబ్బమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో, కేసీ కెనాల్‌కు సంబంధించి బొజ్జవారిపల్లె ఎంపీపీ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. నాలుగు నీటి సంఘాలకు సంబంధించి ఒక్కో నీటి సంఘానికి 12 మంది చొప్పున మొత్తం 48 మంది టీసీ (టెరిటోరియల్ కాన్‌స్టెన్సీ) సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఒక్కో నీటి సంఘంలోని 12 మంది సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. మైలవరం కాలువకు సంబంధించి బొల్లవరం నీటి సంఘం అధ్యక్షుడిగా పల్లేటి అనిల్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి.అమరనాథ్ రెడ్డి, ప్రొద్దుటూరు నీటి సంఘం అధ్యక్షుడిగా గుమ్మళ్ల రాజేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై.సతీష్‌కుమార్‌రెడ్డి, పెద్దశెట్టిపల్లె నీటి సంఘం అధ్యక్షుడిగా ఎద్దుల ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొనిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఉప్పరపల్లె నీటి సంఘం అధ్యక్షుడిగా నారపురెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై.మహమ్మద్ నూర్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులందరికీ ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ ఎన్నికల ప్రక్రియను తహసీల్దార్ గంగయ్య, కేసీ కెనాల్ ఏఈ గురుమోహన్‌రెడ్డి, మైలవరం ఉత్తర కాలువ ఏఈ లలితారెడ్డి పర్యవేక్షించారు. ఏఓ శివశంకర్‌రెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ, ఐసీడీఎస్ రూరల్ సీడీపీఓ కుమారి, ఎన్నికల డీటీ అజయ్ కుమార్ ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు.

రాజుపాళెం మండలంలో..
రాజుపాళెం : కేసీ కాలువ, మైలవరం ఆయకట్టుదారుల సాగునీటి సంఘాల ఎన్నికలు రాజుపాళెం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐలు వెంకటరమణ, సంజీవ రెడ్డి, ధనుంజయ, ఏఎస్ఐలు తదితరులు పర్యవేక్షించారు. మైలవరం కాలువ అర్కటవేముల డబ్ల్యూ ఏ నంబర్ 15 అధ్యక్షుడిగా తల్లు చిన్న సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కోట గోపాల్‌రెడ్డి, కొర్రపాడు డబ్ల్యూ ఏ నంబర్ 16 అధ్యక్షుడిగా బూతూరు వెంకట జయరామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సాన వెంకటరమణారెడ్డి, పొట్టిపాడు డబ్ల్యూ ఏ నంబర్ 18 అధ్యక్షుడిగా గోపిరెడ్డి చిన్న నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వేల్పుల ప్రతాప్, పర్లపాడు డబ్ల్యూ ఏ 10 అధ్యక్షుడిగా కశిరెడ్డి పద్మావతి, ఉపాధ్యక్షుడిగా నాగేళ్ల బాలాంజనేయులు, పగిడాల డబ్ల్యూ ఏ నంబర్ 11 అధ్యక్షుడిగా కానాల విశ్వనాథరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పత్తిపాటి శివశంకర్, కేసీ కాలువ కింద టంగుటూరు డబ్ల్యూ ఏ నంబర్ 65 అధ్యక్షుడిగా కాకర్ల సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.సురేంద్రకుమార్‌రెడ్డి, కొర్రపాడు డబ్ల్యూ ఏ నంబర్ 66 అధ్యక్షుడిగా ధనిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పొన్నపురెడ్డి సాంబశివారెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయా గ్రామాల్లోని ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ మనోహర రెడ్డిలు ఎన్నికలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ హుసేన్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు రూరల్ : ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ గంగయ్య

ఏక పక్షంగా..
చాపాడు : సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు చాపాడు మండలంలో శనివారం ఏకపక్షంగా జరిగాయి. నీటి వినియోగదారుల సంఘం చైర్మన్లుగా డి.గురివిరెడ్డి (అల్లాడుపల్లె), పాలగిరి సత్య వేమారెడ్డి (మిడుతూరు), అంకిరెడ్డిపల్లె నాగిరెడ్డి (సోమాపురం), వర్రా వీరారెడ్డి (అనంతపురం-1), శెట్టిపల్లె నారాయణరెడ్డి (అనంతపురం-2), లక్ష్మీనారాయణరెడ్డి (ఉప్పరపల్లె), శ్రీనివాసులరెడ్డి (మడూరు), ఎస్.ఆర్. శివరామకృష్ణారెడ్డి (చియ్యపాడు), నంద్యాల లోకేశ్వర్‌రెడ్డి (మడూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఖాజీపేట : ఖాజీపేట మండలంలో నీటి సంఘం ఎన్నికలు ముగిశాయి. ఏటూరు నీటి సంఘం చైర్మన్‌గా మూల శ్రీనివాసులరెడ్డి, మిడుతూరు నీటి సంఘం చైర్మన్‌గా పాలగిరి సత్యవేమారెడ్డి, తవ్వారిపల్లె నీటి సంఘం చైర్మన్‌గా కోనా సురేంద్రరెడ్డి, ఖాజీపేట నీటి సంఘం చైర్మన్‌గా నల్ల కొంగు వెంకటేశ్వరరెడ్డి, నాగసానిపల్లె నీటి సంఘం చైర్మన్‌గా సూర్యనారాయణ ఎన్నికై నట్లు అధికారులు తెలిపారు.


చాపాడు: లక్ష్మీపేటలో సాగునీటి సంఘం ఎన్నికలో పాల్గొన్న రైతులు

ఆయకట్టు ప్రెసిడెంట్‌గా సంజీవరాయుడు
కాశినాయన : నరసాపురం ఆయకట్టు చెరువు ప్రెసిడెంట్‌గా యక్కలూరి సంజీవరాయుడు, వైస్‌ప్రెసిడెంట్‌గా గుండం రాజారెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బ్రహ్మంగారిమఠం : మండలంలో శనివారం జరిగిన నీటి సంఘాల చైర్మన్ ఎన్నికల్లో మల్లేపల్లెకు చెందిన శేగినేని గురవయ్య లింగాలదిన్నెపల్లె ఆయకట్టు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై యారు. అలాగే మడేరు ఆయకట్టు చైర్మన్‌గా లగసాని వీరయ్య, మద్దిరెడ్డిపల్లె చెరువు ఆయకట్టు చైర్మన్‌గా పెసల ఈశ్వర్‌రెడ్డి, కమ్మవారిపల్లె నీటిసంఘం చైర్మన్‌గా బోయపాటి చంద్రబాబునాయుడు ఎన్నికై నట్లు అధికారులు తెలిపారు.

మైదుకూరు : సాగునీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బాయ్ కాట్ చేయడంతో మైదుకూరు మండలంలో శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికలలో అన్ని సంఘాలు టీడీపీకి ఏకగ్రీవం అయ్యాయి. మండలంలో శెట్టివారిపల్లె, నంద్యాలపేట, తువ్వపల్లె, తిప్పిరెడ్డిపల్లె చెరువులతో పాటు రెండు కేసీ కెనాల్‌కు రెండు నీటి సంఘాలకు మొత్తం ఆరు సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో తిప్పిరెడ్డిపల్లె, శెట్టివారిపల్లె, తువ్వపల్లె, నంద్యాలపేట చెరువులకు ఆరుగురు చొప్పున సభ్యులు, మైదుకూరు కేసీ కెనాల్ సంఘానికి 12 మంది, శివపురం కేసీ కెనాల్ సంఘానికి 11 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా సాగిన ఎన్నికలు

బద్వేలు అర్బన్ : ప్రజాస్వామిక స్ఫూర్తికి విరుద్ధంగా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నందుకే ఎన్నికల్లో పాల్గొనకుండా బహిష్కరించామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. శనివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో నియోజకవర్గంలోని 60 చెరువులకు సంబంధించి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను నిలబెట్టి గెలుపొందాలనే ఉద్దేశ్యంతో నెల రోజుల క్రిందటి నుంచే ప్రణాళికలు రూపొందించామన్నారు. కూటమి నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ సృష్టిస్తున్న అడ్డంకులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగే అవకాశం లేకపోవడంతో బహిష్కరణ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఎక్కడికక్కడ రెవెన్యూ అధికారులను, పోలీసులను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతుండటంతో పాటు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారన్నారు. బద్వేలు నియోజకవర్గంలో గడిచిన 22 ఏళ్ళలో ఇటువంటి దారుణ పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని వారు అన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం
దేశం మొత్తం అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నడుస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అన్నారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులను వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య
జిల్లాలోని వేములలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్ళిన సాక్షి టీవీ, పత్రిక జర్నలిస్టులపై టీడీపీ నేతలు దాడి చేయడం హేయమైన చర్య అని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అధికార పార్టీ నేతల అరాచకాలను బయటకు తీసుకువస్తున్నారన్న ఉద్దేశ్యంతో జర్నలిస్టులపై దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. తక్షణమే పోలీసు యంత్రాంగం జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

నివాళి
పోరుమామిళ్ల : రామాయపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అల్లూరి ఓబయ్య శుక్రవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ శనివారం ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అదనపు కన్వీనర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి సంతాపం తెలిపారు. అల్లూరి ఓబయ్య మరణం పార్టీకి తీరని లోటని పీఆర్ ఆర్డీ మాజీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు.

క్లుప్తంగా

అవార్డు
ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన వర్ధమాన టీవీ, సినీనటుడు దావూద్.. సూపర్‌స్టార్ రజనీకాంత్–2024 అవార్డును అందుకున్నాడు. ఇటీవల హైదరాబాదులోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఇందిరి ఆర్ట్స్ ఫౌండేషన్‌వారు సూపర్‌స్టార్ రజనీకాంత్ అవార్డును పలువురు సినీనటులు సమక్షంలో దావూద్‌కు అందించిన ఘనంగా సత్కరించారు. ఈ అవార్డు అందుకోవడం ఆనందకరమని, భవిష్యత్‌లో మరిన్ని పాత్రలు పోషించి మరిన్ని అవార్డులు అందుకుంటానని దావూద్ ఆశాభావం వ్యక్తం చేశారు. దావూద్‌కు అవార్డు రావడం పట్ల పట్టణానికి చెందిన పలువురు అభిమానులు, పురప్రముఖులు అభినందించారు.

దుప్పట్ల పంపిణీ
ప్రొద్దుటూరు : స్థానిక రోటరీ ఐ ఆస్పత్రి వద్ద శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సాధువులు, నిరాశ్రయులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ టి.బాలసూర్యారావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 70 మందికి దుప్పట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జి.శ్రీధర్ శర్మ, ట్రస్టు ప్రెసిడెంట్ శివకుమార్, స్పందన రాంప్రసాద్‌రెడ్డి, జాకీర్ మహమ్మద్, జి.వెంకటేశ్వరరెడ్డి, వి.నరసింహారావు, కె.మల్లికార్జున, ఆర్టీసీ బాబా, రామకృష్ణ, నాగబ్రహ్మం పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో..
బద్వేలు అర్బన్ : పట్టణ అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో దాతల సహకారంతో మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు, నిరుపేద అనాథ వృద్ధులకు 180 దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, బి.గురుమూర్తి, వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, పట్టణాభివృద్ధి కమిటీ నాయకులు దాతలు పాల్గొన్నారు.

రాజీ మార్గమే ఉత్తమం

లోక్ అదాలత్‌లో రాజీ అయిన వారికి అవార్డు ఫారం అందజేస్తున్న జడ్జిలు

బద్వేలు అర్బన్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని ఇందుకు లోక్ అదాలత్ సహకరిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, కడప మూడవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.విజయలక్ష్మిలు తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ సందర్భంగా రెండు బెంచిలను ఏర్పాటు చేసి 239 క్రిమినల్ కేసులు, 11 సివిల్ కేసులు చొప్పున మొత్తం 250 కేసులు పరిష్కరించి రూ.49.94 లక్షలు బాధితులకు అందజేసినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
ప్రొద్దుటూరు : ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని పెన్నాగర్‌లో ఉన్న ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు వై.హరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర ద్వారా రూ.15 వేలు ఇస్తామని చెప్పి గాలికొదిలేసిందని విమర్శించారు. కేంద్రం తెచ్చిన గెజిట్ నంబర్ 897కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జీఓ 21, 31 తేవడం దుర్మార్గమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 16న అఖిల భారత ఆటో డ్రైవర్లు, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చి దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. మాజీ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామయ్య మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ గౌరవాధ్యక్షులుగా బి.రామయ్య, అధ్యక్ష, కార్యదర్శులుగా మచ్చా శ్రీను, వై.హరి, ఉపాధ్యక్షులుగా రమేష్‌రెడ్డి, రమణ, బాబు, గురునాథ్, సి.బాబు, హరిబాబు, సి.నరసింహా, సహాయ కార్యదర్శులుగా ఎల్లయ్య, దౌలా, శివ, హుస్సేన్,బాషా,కోశాధికారిగాసుబ్బయ్య,సభ్యులుగా శ్రీను, నాయబ్ రసూల్, పీరా, నాగన్న, మీరావలి, నారాయణను ఎన్నుకున్నారు.

రేపు మృత్యుంజయ హోమం
ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.